## మినీకథ

# నీతులు



మే వెల మిట్ట మధ్యాహ్నం. నడి నెత్తి మీద సూర్యుడు నిప్పులు కక్కుతూ తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. అర గంట నిలబడ్డా జాడలేని బస్సు కోసం ఎదురు చూస్తూ అసహనంగా బస్టాపులో నిలబడ్డాను. చాలా సేపటి నుంచి బస్సు రాకపోవటంతో ఎండను సైతం లెక్క చెయ్యకుండా. నిముష నిముషానికి పెరిగిపోతున్న బస్టావు లోని జనంలో నాలాంటి ఒకరిద్దరు మినహా మిగతా వారంతా బస్సులను సరయిన వేళలకు నడపలేని ఆర్టీసీ వారిని నోటికొచ్చిన తిట్లు తిడుతూ నిర్ల క్ష్యంగా వ్యవహరించే ప్రభుత్వోద్యోగు లపై విమర్శనాస్త్రాలను సంధిస్తూ శావ నార్థాలు పెట్టటంలో బిజీగా ఉన్నారు.

ఇంతలో దూరం నుంచి శబ్దం చేస్తూ వస్తున్న బస్సు కనిపించటంతో జనమంతా తిట్ల పురాణానికి స్వస్తి చెప్పి యుద్ధానికి సిద్ధమయిన సైనికుల్లా ఎలర్ట్‌గా నిలబడ్డారు. అప్పటికే జనంతో కిక్కిరిసిపోయి నిండు గర్భిణీలా నిదానంగా వస్తున్న బస్సు స్టేజి దగ్గరకు రాగానే ఒక్కసారిగా స్పీడందుకొంది. వేరేదారి లేక అక్కడ ఉన్న వాళ్ళం దరం పరుగుపందెంలో పాల్గొన్నాం. కానీ ఎవరో ఇద్దరు ముగ్గురు మాత్రమే అతి కష్టం మీద ఆ పరుగు పందెంలో గెలిచి బస్‌ను అందుకోగలిగారు. మిగి లిన వాళ్ళందరం ఉస్సూరని కాళ్ళీడ్చు కుంటూ మళ్ళీ బస్టాప్‌కు చేరుకున్నాం. "కనీసం బస్ ఆపకుండా ఎంత నిర్ల క్ష్యంగా వెళుతున్నాడో" నా పక్కనే నిల బడ్డ వ్యక్తి గట్టిగా మాట్లాడేసరికి తల తిప్పి చూసాను. మనిషి ఎత్తుగా లావుగా ఉన్నాడు, బ్లాక్ పాంటులోకి వైట్ షర్ట్ టక్ చేశాడు. చేతిలో ఏవో ఫైల్స్. ఉద్యోగస్థుడిలా ఉన్నాడు. జనమంతా తన వంకే ఆసక్తిగా చూస్తుండటంతో మళ్ళీ అతనే అన్నాడు "అసలు వీళ్ళ నిర్లక్ష్యానికి కారణం లంచగొండితనం, ప్రభుత్వం చేతగానితనం. అవునండీ, ప్రభుత్వోద్యోగులందరూ తమ ఇష్టమొచ్చినట్టు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అంతకు ఎవరయినా పైవాళ్ళు అడిగితే లంచంతో వాళ్ళ నోళ్ళు మూయిస్తున్నారు. ఆ ధైర్యంతోనే ప్రభుత్వోద్యోగులు అందరూ లంచగొండులుగా మారి ప్రజల్ని నానా ఇబ్బందులు పెడుతున్నారు. ఏ ఆఫీసులోనయినా, ఏ చిన్న పని జరగాలన్నా లంచం ఇవ్వందే జరగటం లేదు. ఎక్కడ చూసినా లంచం, లంచం. అందుకే లంచం తీసుకొనే వాళ్ళందరినీ బహిరంగంగా ఉరి తీయాలి. లంచగొండితనాన్ని తరిమి తరిమి కొట్టాలి." ఆవేశంగా అతను చెబుతున్న ఆ మాటలు నన్ను ఆకర్షించాయి. అభినందనపూర్వకంగా అతని వంక చూసాను.

మరో పావు గంట తరువాత ఎలాగో బస్సు పట్టుకొని ఇల్లు చేరుకున్నాను. కానీ రెండు రోజుల వరకూ ఆ వ్యక్తి రూపం నా కళ్ళ ముందు మెదులుతూనే ఉంది.

ఆ సంఘటన జరిగిన తరువాత సరిగ్గా పదిరోజులకు. వ్యవసాయంపై మక్కువతో చిన్న పల్లెటూళ్ళో నివసిస్తున్న మా పెదనాన్న దగ్గర నుండి ఒక ఉత్తరం వచ్చింది. గవర్నమెంటు వారిచ్చే లోను కోసం ఫలానా ఆఫీసుకు దరఖాస్తు చేసుకొని చాలా కాలమయింది. ఇంతవరకూ ఏ సమాధానం లేదు. నువ్వు తగ్గర్లో ఉన్నావు కాబట్టి ఒకసారి ఆ ఆఫీసుకు వెళ్ళి ఆ విషయం కనుక్కోగలవు అన్నది ఆ లేఖ సారాంశం.

మరునాడు ఉదయాన్నే బయలుదేరి సగం కాలాన్ని సహనాన్ని బస్టావులో ఖర్చు చేసి చివరకు ఆ ఆఫీసుకు చేరుకున్నాను. అక్కడి క్లర్కుకు విషయమంతా వివరించాను. అతను ఒక పది నిముషాల పాటు అటూ ఇటూ వెదికి "ఆ ఫైలు ఎప్పుడో ఆఫీసరు గారి దగ్గరకు వెళ్ళిందండి. అక్కడకి వెళ్ళిందంటే పని అయిపోయినట్లే, కానీ ..." అని బుర్రగోక్కుంటూ నసిగాడు.

"అంతా అయిందంటున్నావు. ఇంకా 'కానీ' ఏమిటయ్యా??" అన్నాన్నేను అతని ప్రవర్తన అర్థంకాక.

"మీకు తెలియదండీ. ఈ ఆఫీసరు గారు ఒట్టి లంచగొండి మనిషి. చేతిలో బరువు పడందే ఫైలు బయటకు రానివ్వడు. అందుకని ఒక వెయ్యి రూపాయలు మీవి కావను కొని ఇచ్చారంటే ఐదు నిముషాలలో మీ ఫైలు బయటపడుతుంది." అన్నాడు రహస్యంగా. "వెయ్యి రూపాయల లంచంమా! అంత డబ్బు నా దగ్గర లేదు. అయినా అసలెందుకివ్వాలి? ఈ విషయం ఆఫీసరు గారినే అడుగుతాను" అంటూ వేగంగా వెనక్కి తిరిగి వస్తుంటే. "సార్ సార్ ఆగండి మిమ్మల్నే అని అరుస్తూ నాతో పాటే ఆఫీసరు గదిలోకి వచ్చాడు అతడు కూడా. ఆ రూమ్‌లో అడుగుపెట్టగానే ఆఫీసరు స్థానంలో కూర్చొని ఉన్న వ్యక్తిని చూసి ఆశ్చర్యంతో నోరు తెరిచాను. అదే వ్యక్తి ఆ రోజు బస్టావులో లంచగొండితనాన్ని ఎదురించాలని లెక్చర్లు దంచిన వ్యక్తి. ఇప్పుడు ఇక్కడ ఆఫీసరుగా కూర్చొని ఉన్నాడు.

నేను నోరు తెరిచి మాట్లాడబోయే సరికి "ఏమిటయ్యా గోల" అన్నాడు క్లర్కు వైపు చూస్తూ.

"ఇతని వాళ్ళ లోను ఫైలు మీ దగ్గరుంది సార్. కానీ పైసా ఇవ్వనంటు న్నాడు." అన్నాడు క్లర్కు 'వినయంగా' చేతులు కట్టుకొని.

ఆ ఆఫీసరు నా వైపు ఎగాదిగా చూసి "ఏమయ్యా? వేలకు వేలు గవర్నమెంట్ సొమ్ము తేరగా తీసుకొంటారు గాని, ఓ వెయ్యి రూపాయలు ఇవ్వాలంటే ఏడుస్తారెందుకు? చూడూ వెయ్యి రూపాయలు ఈ చేతిలో పెడితేనే ఆ ఫైలు బయటికొస్తుంది. లేదా దాన్ని గురించి మర్చిపో. అది కాదంటే నీకు చేతనయింది చేసుకో. మరోసారి ఖాళీ చేతులతో మాత్రం ఇటు వైపు రావద్దు. వెళ్ళు" అన్నాడు నిర్లక్ష్యంగా.

మాటలకు, చేతలకు ఉండే తేడా ఒక సజీవ దృశ్యంలా ముందు కనబడుతుంటే నా నోటి వెంట మాటరాలేదు. అప్పుడర్థమయ్యింది "మనమంతా నోటి మాటలకు, చేతి రాతలకే పరిమితమయి కార్యరూపంలో కనిపించని నీతి సూత్రాలు వల్లె వేస్తూ కూర్చున్నంత కాలం ఈ దేశమింతే, నాలాంటి సగటు మనుషుల బ్రతుకులింతే.

—యం.వెంకటేశ్వర రావు,
దుద్దెపూడి, ఖమ్మం జిల్లా.